క్లుప్తంగా

చిన్నదోర్నాల ఎస్‌ఎంసీ చైర్మన్‌గా చార్లెస్

పెద్దదోర్నాల: మండల పరిధిలో శనివారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడైన యలకపాటి చార్లెస్ పాఠశాల చైర్మన్‌గా విజయం సాధించటం హర్షణీయమని మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన చార్లెస్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

పశుపోషకుడికి ఆర్థిక సాయం

పుల్లలచెరువు: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందడంతో పశుపోషకుడికి విద్యుత్ శాఖ అధికారులు ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు.. మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండాకు చెందిన ఆర్.హనుమంతు నాయక్‌కు చెందిన గేదె మే 10వ తేదీన గ్రామంలో విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందింది. విషయం అప్పట్లో విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం ఆ రైతుకు విద్యుత్‌శాఖ ప్రకటించిన రూ.40 వేల చెక్‌ను ఏఈ కిషోర్ అందజేశారు. విద్యుత్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక తనిఖీని సక్రమంగా నిర్వహించాలి

దొనకొండ: గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీని వీఎస్ఏలు, డీఆర్‌పీలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి సూచించారు. స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 18 పంచాయతీల్లో చేపట్టిన పనులు ఏప్రిల్ 1 2023 నుంచి మార్చి 31 2024 వరకు జరిగిన పనులను వీఎస్ఏలు, డీఆర్‌పీలు సక్రమంగా కొలతలతో రికార్డు చేయాలన్నారు. అందులో భాగంగా చెక్ డ్యామ్‌లు, కట్టలు, చెరువు పూడిక, కుంటల పూడిక, హౌసింగ్, పండ్ల తోటల పెంపకం సంబంధించి రూ.6 కోట్లతో పనులు జరిగినట్లు తెలిపారు. ప్రజావేదికలో చదివి వినిపించాలని, తప్పులు లేకుండా ముందుగానే గ్రామాల్లో సంబంధిత ప్రజలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఝాన్సీరాణి తెలిపారు. ఎస్ఆర్‌పీ పి.సురేష్, ఏపీఓ టి.దేవయ్య, ఈసీ శివరామ్, డీఆర్‌పీలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

గణితాన్ని సులభ పద్ధతిలో బోధించాలి

పుల్లలచెరువు: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా గణితాన్ని సులభ పద్ధతిలో బోధించాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ పేర్కొన్నారు. మండలంలోని పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం కాంప్లెక్సు సమావేశం నిర్వహించారు. సమావేశానికి పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల పరిధి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో నేర్చుకున్న అంశాలను, ప్రభుత్వం సూచించే పద్ధతులను అనుసరించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ పద్ధతిలో బోధన చేయాలన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చే పద్ధతులను ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని బోధన చేయాలన్నారు. మూడు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓకు అభినందనలు



రజియా బేగాన్ని అభినందిస్తున్న వార్డెన్‌లు

దర్శి: ఉత్తమ ఏఎస్‌డబ్ల్యూఓగా ఎంపికైన దర్శి సాంఘిక సంక్షేమ అధికారి ఎస్‌కే రజియాబేగానికి ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభినందనలు తెలిపారు. ఈ నెల 15వ తేదీన ఆమె కలెక్టర్ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సాంఘిక సంక్షేమాధికారి కార్యాలయంలో ఆమెను అభినందించారు.

బీఎల్‌ఓలకు అవగాహన



బీఎల్‌ఓలకు అవగాహన కలిగిస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

కురిచేడు: మండలంలోని బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ జి.రజనీకుమారి అవగాహన కల్పించారు. నూతన ఎలక్ట్రోరల్ జాబితా తయారు చేయాలని, ఆగస్టు 20వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు ఓటరు జాబితాపై సర్వే చేయాలని, నూతన ఓటర్లను నమోదు చేయాలని, ఓటరు జాబితాలోని తప్పులు సరిచేయాలని, మృతులను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, ఓటు హక్కు గురించి ప్రజలకు అవగాహన, నూతన ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేయాలని సూచించారు.

కోల్‌కతా ఘటనపై దర్శిలో వైద్యుల నిరసన

● చట్టాలు మార్చాలని డిమాండ్

దర్శి: ఆంధ్రప్రదేశ్ వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బ్లెస్సీ డిమాండ్ చేశారు. కోల్‌కతా ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆగస్టు 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న పీజీ రెండో సంవత్సరం చదువుతున్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఉయ్ వాంట్ జస్టిస్.. అంటూ గడియారం స్తంభం సెంటర్ మార్మోగేలా నినాదాలు చేశారు. బాధిత మహిళకు న్యాయం చేయాలి.. బాధ్యులైన మృగాలను వెంటనే శిక్షించాలని పట్టణ వీధుల్లో భారీ సంఖ్యలో వైద్య సిబ్బంది పాల్గొని ర్యాలీగా తమ డిమాండ్‌లు తెలియజేస్తూ గడియారం స్తంభం సెంటర్‌కు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఆస్పత్రిల్లో అత్యవసర వైద్య సేవలు మినహా వైద్యసేవలను నిలిపివేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుమన్, పీహెచ్‌సీ వైద్యులు బ్లెస్సీలు మాట్లాడుతూ ఘటన జరిగి ఐదు రోజులైనా చర్యలు తీసుకోక పోగా సాక్ష్యాలు తారుమారు చేశారన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్యసిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని డిమాండ్ చేశారు. వైద్యులు శ్రీనివాస్, ఎస్‌ఎం బాషా, భవనం కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్, హర్ష, మోహన్‌శివకుమార్, మహమద్ రఫీ, రాజేష్ పాల్గొన్నారు.



పెద్దదోర్నాలలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లూరు (దర్శి): వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని వైద్యులు ఖాదర్ మస్తాన్‌బీ అన్నారు. కోల్‌కత్తాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో ఆగస్టు 9వ తేదీన రాత్రి డ్యూటీలో ఉన్న పీజీ రెండో సంవత్సరం చదువుతున్న మహిళా వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని కోరుతూ నిరసన ర్యాలీ శనివారం నిర్వహించారు. ప్లకార్డులతో వీధుల్లో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఖాదర్ మస్తాన్‌బీ మాట్లాడుతూ ఘటన జరిగి వారం రోజులు దాటినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్రం జోక్యం చేసుకుని తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్ యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గడియారం స్తంభం సెంటర్‌లో నినాదాలు చేస్తున్న వైద్యులు

పెద్దదోర్నాల: వైద్య విద్యార్థి హత్య, అత్యాచారం ఘటనకు నిరసనగా మండల కేంద్రంలో శనివారం వైద్య సిబ్బంది భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యుడు సంజీవ్ మాట్లాడుతూ వైద్యులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలన్నారు. వైద్యురాలిని చంపిన మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి వారికి ఉరిశిక్ష విధించాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహించే వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. దీంతో పాటు ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో సెక్యూరిటీని నియమించి, వైద్యుల మాన,ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.



తాళ్లూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డాక్టర్ లావణ్య, హెడ్ నర్స్ ఎలిజిబెత్, ఫార్మసిస్టు పిచ్చిరెడ్డి, ఆరోగ్యమిత్ర మందగిరి చంద్రశేఖర్, మణికుమార్, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొని మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.

అవినీతికి అడ్డాగా యర్రగొండపాలెం

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అవినీతి అడ్డాగా మరుస్తోందని, కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటకముందే తమ నాయకులు దోచుకునే విధంగా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం స్థానిక కొలుకుల రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు తాగునీటి వసతి కల్పించేందుకు నియోజకవర్గంలోని ముటుకుల, యర్రగొండపాలెం, గొల్లపల్లి, నడిగడ్డ సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ల నిర్వహణకు ప్రభుత్వం జిల్లా పరిషత్ నిధుల నుంచి దాదాపు రూ.3 కోట్లు కేటాయించిన ఆ టెండర్‌ను ఒక కాంట్రాక్టర్ దక్కించుకుంటే అతడిని కాదని, మరొకరికి ఆ నిర్వహణా పనులు అక్రమంగా కట్టబెట్టారని ధ్వజమెత్తారు. దర్శి ప్రాంతానికి చెందిన టీడీపీ వర్గీయుడు ఆ సీపీడబ్ల్యూఎస్ పనులను నిర్వహిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆదేశాలు జారీ చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ చర్య ప్రజలకు దాహార్తి తీర్చేవిధంగా లేదని, టీడీపీ వర్గీయులు దోచుకొని తినే విధంగా ఉందన్నారు. అన్ని శాఖల్లో అనధికార వ్యక్తులు చొరబడి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, తమ వాటాలను మాట్లాడుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు కూడా వారికి విలువ ఇవ్వడం విడ్డూరంగా ఉందని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తుంటే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే తాటిపర్తి హెచ్చరించారు. ఆయా శాఖలకు మంజూరైన నిధులు సక్రమంగా సద్వినియోగం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు కేటాయించిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనుల ఎస్టిమెంట్ సక్రమంగా లేదని, టీడీపీ వర్గానికి చెందిన నాయకుడు ఉన్న పంచాయతీకి ఎక్కువ నిధులు, మిగిలిన పంచాయతీలకు తక్కువ నిధులు కేటాయించి అధికారులు పచ్చపాతం చూపిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎస్టిమెంట్‌లు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు ఆయా పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు తీర్మానం చేయాల్సి ఉందని, అటువంటి పరిస్థితి లేకుండా తమ ఇష్టానుసారంగా పనులను కేటాయించి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే తాటిపర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

108లో గర్భిణి ప్రసవం

దొనకొండ: మండలంలోని మంగినపూడి గ్రామానికి చెందిన మరియమ్మ ప్రసవ వేదన అధికం కావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వెంటనే దొనకొండ నుంచి వాహనం మంగినపూడి చేరుకుని మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి గర్భిణిని తరలిస్తుండగా మార్గమధ్యంలో సిద్ధాయపాలెం వద్ద మరియమ్మ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బాలజ్యోతి ప్రథమ చికిత్స చేసి సుఖ ప్రసవం చేశారు. విషయం తెలుసుకున్న మరియమ్మ కుటుంబ సభ్యులు, 108 అంబులెన్స్ సిబ్బందికి, మేనేజర్ విజయకుమార్, పొదిలి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజేంద్ర ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.



108లో బిడ్డకు జన్మనిచ్చిన మరియమ్మ

ఫ్లోరోసిస్ బాధితులకు అవగాహన



ఫ్లోరోసిస్ బాధితులు అందుకున్న వాకర్స్

దొనకొండ: స్థానిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ హెల్త్ ప్రోగ్రాం వైద్యాధికారి ఈ.ప్రశాంత్ ఆదేశాల మేరకు వైద్యులు అనిల్‌కుమార్ ఫ్లోరోసిస్ బాధితులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫ్లోరోసిస్ బాధితులు, ఎయిడ్స్ బాధితులకు వ్యాధులపై అనిల్‌కుమార్ అవగాహన కల్పించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం బాధితులకు వాకర్స్ అందించారు. వైద్యాధికారి కె.సునీత, సీహెచ్‌ఓ కె.ఇన్నాసమ్మ, ఏఎన్‌ఎం లీలాబాయి, టెక్నీషియన్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో..

స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి అనిల్‌కుమార్ ఫ్లోరోసిస్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. తాగునీరు, ఆహార పదార్థాల్లో విటమిన్ సీ, క్యాల్షియం ఉపయోగాలు, ఏ ఆహార పదార్థం తింటే ఫ్లోరోసిస్ వ్యాధిని నివారించవచ్చని విద్యార్థులక వైద్యాధికారి తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



జి.చెర్లోపల్లిలో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు



అబ్జర్వర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీ చైర్మన్లు పాటు పడాలని దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ అన్నారు. మండలంలోని రెడ్డినగర్, పలుకురాళ్ల తండా పాఠశాలలో శనివారం జరుగుతున్న ఎస్‌ఎంసీ ఎన్నికలను ఆయన సీఐ రామారావు, ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలని సూచించారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. పంతాలకు పోవడంతో విద్యార్థుల్లో ఐక్యత దెబ్బతింటుందన్నారు. పాఠశాలల ఎన్నికలను రాజకీయం చేయడం మంచి సంస్కృతి కాదన్నారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకొని మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. తద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

మరోసారి వాయిదా

మండలంలో శనివారం సుంకరవారిపాలెం, పులిపాడుతండా, చిన ఉల్లగల్లు, రెడ్డినగర్, పలుకురాళ్ల తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. అందులో మూడు పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగా సుంకరవారిపాలెం, పులిపాడుతండా, చిన ఉల్లగల్లు ఎస్‌ఎంసీ చైర్మన్ల నియామకం అబ్జర్వర్లు పూర్తి చేశారు. కోరం లేని కారణంగా రెడ్డినగర్, పలుకురాళ తండా గ్రామాల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

పుల్లలచెరువు: రెండు పాఠశాలల్లో కోరం లేక ఎస్‌ఎంసీ ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈవో శామ్యూల్‌జాన్ తెలిపారు. మండలంలోని ఆరు పాఠశాలల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా 4 పాఠశాలల్లో యండ్రపల్లి, కుందంపల్లి, మర్రివేముల ఎస్సీ, మెయిన్ పాఠశాలల్లో చైర్మన్‌లను ఎన్నుకున్నారని, మిగిలిన సింగుపల్లి, వెంకటరెడ్డిపల్లిలో వాయిదా వేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాలపై త్వరలో ఆ రెండు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

ముండ్లమూరు: మండలంలో శనివారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో జనసేన క్యాడర్‌కు అన్యాయం జరిగిందని చిన ఉల్లగల్లు ఎస్‌ఎంసీ ఎన్నికలో పోటీ చేసిన పాలకీటి సత్యవేదం, ఆమె భర్త, జనసేన నాయకుడు పాలకీటి యోహానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో హెచ్‌ఎం కోరం లేని కారణంగా ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. శనివారం ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా నూతనంగా ఎన్నిక నిర్వహణకు వచ్చిన అబ్జర్వర్ ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ టీడీపీ అనుకూల వర్గం వారికి ఎస్‌ఎంసీ చైర్మన్ పదవి కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయమై ఎంఈఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఎస్‌ఎంసీ ఎన్నికలో తమకు అన్యాయం జరుగుతుందని సత్యవేదం తరుపు వాళ్లు తనకు ఫోన్ చేయగా అక్కడ అబ్జర్వర్‌ను సంప్రదించి సమస్య తెలియజేయాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

పెద్దారవీడు: మండలంలో బద్వీడుచెర్లోపల్లి మండల పరిషత్ ప్రాథమిక (డిపెప్) పాఠశాలలో పాఠశాల కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో చైర్మన్ జడ్డా చిన్న గాలెయ్య, వైస్ చైర్మన్ జడ్డా ఎలిజిబిత్‌రాణి, మరో నలుగురు సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దుదేకుల సిద్ధమ్మ, జెడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం రత్నశంకర్‌నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఓబులక్కపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చాట్లమడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు కోరం లేక ఎన్నికలు వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

వరుణుడి కరుణ కోసం మొక్కులు



స్వామివారికి పొంగళ్లు చేస్తున్న మహిళలు

కురిచేడు: కాలం గడచిపోతున్నా, అదును దాటిపోతున్నా వరుణుడి కరుణ లేక పోవటంతో రైతులు దేవుళ్లను మొక్కుతున్నారు. మండలంలోని కాటంవారిపల్లె గ్రామానికి చెందిన రైతులు శనివారం వరుణుడి కరుణ కలగాలని ప్రార్థిస్తూ శ్రీ పట్టాభిసీతారాముల వారికి పొంగళ్ల నైవేద్యం చేసి సమర్పించారు. మహిళలు ఉపవాస దీక్షపూని అందరూ కలిసి నిష్ఠగా పొంగళ్లు చేసి నివేదించారు. అనంతరం వరుణుడి కరుణ తమ మీద ఉంచాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. వారి మొర ఆలకించిన వరుణుడు శనివారం సాయంత్రం జల్లు కురిపించాడు.

ఆలయాల్లో భక్తుల సందడి



అలంకరణలో శ్రీవారు



పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి



ఆలయంలో ఉన్న భక్తులు

కొనకనమిట్ల: శ్రావణ మాసం శనివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో, కొనకనమిట్ల రామ దూత క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా సీతారాములవారి ఆలయ వార్షికోత్సవం

తర్లుపాడు: స్థానిక బీసీకాలనీలోని పట్టాభి సీతారామ స్వామి వారి మూడో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ఘనంగా కల్యాణం నిర్వహించారు. తర్లుపాడుతో పాటు నాయుడుపల్లి, మీర్జపేట, సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసంతర్పన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు